"ఎప్పుడు వాలుతావా అని వుంది" అని సౌదామిని బదులు చెప్పింది.

"అక్కా జట్టువచ్చి" అంది చెల్లెలు సీత తనని సౌదామిని తీసుకుపోలేదన్న రోషంతో.

"అవునమ్మా వచ్చి కొట్టేద్దాం. పెద్దయితే నువ్వూ ఇంతే చేస్తావా మమ్మల్ని? ఒక అయ్యా ఒక్కొకతరిన్

చేతుల్లో పెట్టేదాకానే అమ్మా నాన్నా. ఆ తరవాత నీరెవరో, మేమెవరో, ఎవరికి వారే యమునాతీరే" అంది మనస్సుని వికలంచేసిన విరక్తితో తల్లి, సీతని చేతుల్లో ఎత్తుకుని. తల్లి మాటలు అర్థం కాక సీత బెదురుచూపుల్తో "అక్కా జట్టువచ్చి" అని మళ్ళీ బిగ్గరగా అంది.

# పువుబోండ్లు కటారి కత్తియల్

## "జయంతి"

"వసుంధరా! నీకీ వుత్తరం ఎవరు రాస్తున్నారో తెలుసనుకుంటాను. 'ఇంత సాహసించి రాస్తాడా' అని నువ్వనుకోవచ్చు. నేను గనక అలా రాయకపోతే కేవలం కృత్రిమము, అసహజము అయిన స్వభావం గలవాణ్ణి అవుతాను. నేనీ వుత్తరం ఎందుకు రాస్తున్నానో నీకు తెలియదు. కొంత తెలిసినా తెలియవలసినంతగా తెలియదు. ఈ వుత్తరం నీకు వింత సంఘటనల్లో రాస్తున్నాను. హతాశుడినై మరణశయ్యమీద నుండి రాస్తున్నాను. నాచుట్టూ కట్టబడ్డ గోరీలో కూచుని రాస్తున్నాను. ఏది యేమైనాసరే రాస్తున్నాను. జరగవలసిన సంఘర్షణ సందర్భాలు జరిగి తీరుతాయి. మానవు. వాటిని మళ్ళించే శక్తి మన చేతుల్లో లేదు. అందుచేతనే యీ వుత్తరం రాసేస్తున్నాను.

"నీకు తెలుసు వసుంధరా! నే నీ యింటిలో అడుగు పెట్టింది మొదలు నువ్వు నాకేసి చూస్తున్నావు. విడవకుండా చూస్తున్నావు. కోమలంగా వింతగా, అందంగా చూస్తున్నావు. నిశితంగా, గాఢంగా చూస్తున్నావు. వెనకవాటుగా ప్రక్కవాటుగా చూస్తున్నావు. ఈ సంగతి కాదనలేవు గదా! నువ్వు చూసిన వెంటనే, వెను వెంటనే నేనూ చూస్తున్నాను. అంత కోమలంగా వుండవు నా చూపులు. అంత తీక్షణంగా వుండవు. అయినా చూస్తున్నాను. వెర్రిగా, దీనంగా, ప్రాధేయపడుతున్నట్టు... అంతే? అంతకు మించి చూడలేను కూడాను!

"నాకు తారతమ్యాలు తెలియవని నువ్వనుకో నక్కరలేదు. బాగా తెలియకపోవచ్చు. కాని, నీకన్న ఎక్కువ తెలుసు. నీకే లోటూ లేదని, నీ భర్తకు నువ్వు చెప్పినదే వేదమని తెలుసు. మీకు చాలా ధనముందని నాకు తెలుసు. అలాంటి నువ్వు వేరే దృష్టితో ఎవర్నీ చూడనక్కరలేదనికూడా నే నెరుగుదును. కాని, వసుంధరా! నీ చూపులు నా కర్థం కావడంలేదు. నీ కన్నుల లోతు నేను కనుక్కోలేను. వాటి అడుగున వున్నది ముత్యాలో, ముగ్గురాళ్లో నాకు తెలియదు. నాకు తెలిసినదల్లా నువ్వు చూస్తున్నావనీ, ఎందుకో నాకేసి చూస్తున్నావనీ..."

"వసంత అందాలరాణి అనడంలో సందేహం లేదు. ఆమెలో సౌందర్య లక్షణాలు లక్ష లున్నాయి. సహజ సంస్కారంతో గుండె నిబ్బరంగల మనిషి. ఆమె గుణగుణాలు రత్నాల రాసులు. అయినా, అలాంటి భార్య సమీపంలో వుండే, నేను నీకేసి చూస్తున్నానంటే కారణం ఏమైవుంటుంది? ఆ కారణమే నిన్నూ నాకేసి చూడమంటోందేమో!"

"గలగలలాడే నీ గాజులచప్పుడువిని నా రక్తం పొంగుతుంది. మందంగా నీరసంగా వున్నప్పుడు కోకిలారావంలాంటి నీగొంతు వినిపించి నాలో నూతన చైతన్యాన్ని కలిగిస్తుంది. వెర్రిగా విచారంగా వున్నప్పుడు నీ పకపకలువచ్చి నిరుత్సాహాన్ని దూరంగా తరిమేస్తాయి. వీటన్నిటికీ చాలా కృతజ్ఞుణ్ణి."

"కాని, ఒక్కొకరోజు గడుస్తున్న కొద్దీ నాలో రణరంగం ఎక్కువవుతూంది. నా శరీరంలో అణువూ అణువూ పోట్లాడుకొంటున్నాయి. దేహం హారతి కర్పూరంలాగ క్షణక్షణం హరించి

పోతూంది. రాత్రులు నిద్రపట్టదు. నిన్నుగురించిన తలపులో, కలలోకూడా నిర్ణయించుకోలేని స్థితిలో రాత్రులు గడుస్తాయి. పాపం, వసంత తెలుసుకోడాని కెంత ప్రయత్నించిరా, నేనెన్నడూ ఈ రహస్యాన్ని వెల్లడించలేదు."

"కనక ఇంకెంతకాలం ఈ ఆవేదన భరించాలి వసుంధరా! ఇక ఆట్టేకాలం ఇలా చూచుకుంటూంటే ప్రయోజనంలేదు. ఇరుపక్షాలకూ నష్టమే. ఇప్పటికే నేను నీరసించిపోయాను. నీ కనుకొలకుల్లో కూడా అశాంతి గోచరిస్తూంది నాకు. అందుకే ధైర్యం వహించి యిలా రాస్తున్నాను. బాగా ఆలోచించుకో, నీ యిష్టమైతే తెలుపు, ఇష్టం కాకపోతే నన్ను క్షమించు. ఈ నిర్భాగ్యుణ్ణి కరుణించి గోలమాత్రం చెయ్యవద్దు. ఈ కాగితంమీదనే జవాబు వెంటనే......"

వసుంధర ఉత్తరం ప్రక్కన పెట్టింది. ఆమె వళ్ళంతా చెమటలు పోశాయి. శరీరం కంపిస్తూంది. ఎన్నడూ తన జీవితంలో యిలాంటి పరిస్థితికి ఆమె గురి కాలేదు. ఇలాంటి సంఘటన జరగలేదు. ఇంతవరకూ ఆమె వందలాది ఉత్తరాలు చదివింది. కాని, ఎన్నడూ తన పాతికేండ్ల జీవిత చరిత్రలో యిలాంటి ఉత్తరం ఆమె కళ్ళ చూడలేదు.

వసుంధర దీనాననంతో లేచింది. గది కిటికీ అద్దాలగుండా వీధిలోకి చూస్తూంది. ఎర్రటి అద్దాలగుండా చూచిన వస్తువులు ఎర్రగానే కనిపిస్తున్నాయి. వీధివెంట పోతూన్న మనుష్యులు ఎర్రగా వున్నారు. ఆ ఎర్రతనం తన కళ్ళల్లో వుందో ఆ మనుష్యుల్లో వుందో తెలిసికోగోరడం తన్న తెలివితక్కువతనం ఏమిటి! వసుంధర ఆలోచిస్తూంది. ఆ అద్దాలు ఆ గదికి అమర్చిన వాడిదేమో ఆ దోషం. అయినా వాడు 'వసుంధర' అనే స్త్రీ చూడాలని ప్రత్యేకించి ఆ అద్దాలు కిటికీకి అమర్చలేదే !

వసుంధర మంచం మీద వాలిపోయింది. అమ్మ, నాన్న, వంశమర్యాద ఏవేవో తలపుకు వచ్చాయి. ఏదో పుస్తకం తీసి చదవ నారంభించింది. పైకి ఎంత గట్టిగా చదువుతున్నా పొంగి పొరలే దుఃఖం ఆగలేదు. మనస్సు ఎక్కడో వుంది. అది దృష్టితో కలిసి పని చెయ్యడం లేదు. దూరాన మనస్సులో మోహనరా వసుపించేదు. అతడు మామూలు మోహనరావే. తాను మూడు వారాలుగా తొంగి చూస్తున్న మోహనరావే. తన చిరునవ్వుకు మారు నవ్వే మోహనరావే. తనకు కావలసిన పుస్తకాలు, పత్రికలు పంపించే మోహనరావే. కాని యీ క్షణంలో అతని రూపం మారిపోయింది. పెద్దపులి, ఎలుగుబంటి, విషసర్పం...వీటన్నిటి కంటె క్రూరమైన ఆకారం తాల్చినాడు. వసుంధర కళ్ళు మూసుకుంది. పుస్తకం ప్రక్కన పెట్టి ఒక ప్రక్కకు వత్తిగిలింది. మోహనరావు కేసి తాను మూడు వారాలనుంచీ ఎందుకు చూసేది? ఎందుకంత తహతహ పడేది? వ్రేలాడుతున్న అతని బుగ్గలలోని అమాయకత్వాన్ని ఎందుకు లోలోన ప్రశంసించేది? అతని విశాలవక్షం, ఆజానుబాహువులు తన నెందు కంతగా ఆకర్షించేవి? వసుంధరకు కొంత శాంతి లభించినట్లయింది. కాని, అది క్షణికమే. వ్యక్తావ్యక్తాల ద్వంద్వ యుద్ధం తప్పదు. వాటికిప్రకృతి దోహదం యివ్వడమూ తప్పదు. ఆదేక్షణంలో ఒకపిల్ల వెండికంచాన్ని క్రిందకుత్రోసి పరుగెత్తుతోంది. వసుంధర దృష్టి దానిమీద పడింది. బీరువాలు, వెండి సామానులు పట్టుబట్టలు... ఈ బంధాలు సడలించుకుని దూరంగా పోవడం అంత సులభసాధ్యంకాదు. ఆమెలో ఒక అభిమానం, రోషం, ఆవేశం ఆవరించేయి. 'ప్రపంచం నిండా గోముఖవ్యాఘ్రాలు, ద్విజిహ్వాలు, పిశాచాలు నిండిపోయేయి' అనుకుంది. పగ తీర్చుకోవాలనే పట్టుదల ఆమె నావేశించింది. వెంటనే లేచి ఆ ఉత్తరం ట్రంకుపెట్టెలో పెట్టి తాళం వేసింది,

"ఏమిటి వసుంధరా! విశేషాలు" అంది వసంత గదిలో అడుగు పెడుతూ. వసుంధర చలించింది, ఆమె జరిగినదంతా చూడలేదుకదా!

"ఏమీ లేదు" అంది మందంగా.

"అలాగున్నావేం విచారంగా."

"ఏమీ లేదు."

"నావద్ద దాచవద్దు వసుంధరా! నాకంతా తెలుసు".

"నీకేం తెలియదు. తెలిస్తే నాకంటే ఎక్కువ యేడుస్తావు. ఆత్మహత్య కూడా చేసుకుంటావేమో' అంది వసుంధర వెర్రిగా.

"నేనంత బలహీనురాలిని కాను" అందివసంత.

"పోనీలే! నా మనస్సు బాగాలేదు. నన్ను ఒంటరిగా విడువు. రేపురా, దయవుంచి" అంది వసుంధర.

"నాపని పూర్తికానిదే వెళ్ళను. పనిగనుక అయితే ఒక్క క్షణంవుండదు" అంది వసంత నిర్లక్ష్యంతో.

"ఏమిటి పని నాతో"

"అలారా, వసుంధరా దారిలోకి, నిన్ను కలవర పెడుతున్న వస్తువును ఇలా పారెయ్యి"

"అయితే నీకంతా తెలుసన్నమాట" అంది వసుంధర ఆశ్చర్యంతో.

"దాచడం దేనికి? అన్నీ గ్రహించేను. నువ్వూ ఆయనా కలసి చూపిన అజ్ఞాన ప్రదర్శనాన్ని భరించే నింతకాలం"

"వసంతా! మాటలు సరిగా రానియ్యి. ఆ నీచునితో నన్నూ జత చెయ్యకు"

"వసుంధరా! ఉద్రేకపడి ప్రయోజనంలేదు. ఆవేశాన్ని అరికట్టుకో. ఆ వుత్తరం నా చేతికియ్యి. వెళ్ళిపోతాను" — వసంతలోని నిశ్చలత్వాన్ని చూస్తున్నకొద్దీ వసుంధరకి ఆవేశం ఎక్కువయింది. ఈవిషయం వసంతకు తెలియడం ఆమె కింకా అవమానకరంగా తోచింది.

"నేనివ్వను. దుర్మార్గులు శిక్షింపబడాలి. లేకపోతే కొంపలు తీస్తారు"

"అయితే నువ్వూ దుర్మార్గురాలివే. నీకూ శిక్షపడాలి..." అంది వసంత.

వసుంధర కోపం పట్టలేక పోయింది. చెయ్యి తీసి ఫెడీమని కొట్టింది వసంతను కాని, ఆమె చలించలేదు.

"వ సు ం ధ రా ! ఒకసారి ఆగు. తర్వాత ఎన్నైనా కొట్టుభరిస్తాను. నామాటలకు సమాధానం చెప్పు. నువ్వాయనను రోజూ తొంగి తొంగి చూడడం లేదా? ఆయన చదివే పత్రికలు తెప్పించుకోడం లేదా? వాటిని తిరిగి పంపేటప్పుడు ఆయన పేరు నీ దస్తూరీతో ఎందుకు రాస్తావు? మొన్న లడ్డూలుచేసి ఆయన కెందుకు పంపించేవు? మాకేం తిండి లేదనుకున్నావా? ఆయన ఎక్కడకు వెళ్ళిందీ చెప్పమని మా నౌకర్ని ఎందుకు బాధిస్తావు? ఆ సోదాలుతీసే అధికారం నీ కెవరిచ్చేరు?..."

వసుంధర తల వంచుకొంది. ఎర్రగా కందిన అరచేతిని చూచుకొంటూంది గాని అంతకన్న ఎర్రబడ్డ వసంత దవడను చూడడానికి ఆమెకు, ఆమెకు ధైర్యం రాలేదు. ఐనా ఆమె రోషమూ చల్లారలేదు. మళ్ళీ అదే ధోరణిలోనే అంది.

"నువ్వు ఎంత సమర్థించుకున్నా సరే. దుర్మార్గులకు శిక్ష జరగాలి. నా భర్తకు చూపి యిస్తాను నీ కావుత్తరం రేపురా."

"ఓయబ్బా! ఏం బెదిరిస్తావు, సరే చూస్తాం ఏమంత శిక్ష వేయిస్తావో. కొన్ని అసందర్భాలు, అవమానాలు తాత్కాలికంగా కల్పిస్తావేమో! ఇంతేగా? ఎవరి జీవితంలో తప్పేయి ఇలాంటి బలహీనపు ఘడియలు-వాటి నన్నింటినీ ఎదుర్కోడానికి దేవుడే యిచ్చాడు మాకు ధైర్య స్థైర్యాలు. కాని, ఒక్కమాట విను. నువ్వు తలపెట్టిన శిక్ష నీకు తగలకుండా చూసుకో..." అంది వసంత. ఆమె చూపిన ధైర్యం వసుంధరలో ఒక ఆశ్చర్యాన్నే కాదు, భయాన్నికూడా కలిగించింది. ఎందుకో వసంత ఆదర్శప్రాయమయిన శీలవతిగా తోచింది. వసుంధర కొంచెం పశ్చాత్తాపపడుతూ అంది.

"సరే! అలాంటి వుత్తరం నీకు ఎవరైనా రాస్తే నువ్వేం చేస్తావు..."

"ఆ వుత్తరం చింపి, ముక్కలు తిరిగి పంపేస్తాను" అంది వసంత జంకకుండా.

వసుంధరలో రోషం పూర్తిగా చల్లారిపోయింది.

"వసంతా! నన్ను క్షమించు. అజ్ఞానురాలినై నీమీద చెయ్యి చేసుకున్నాను. తప్పు చేశాను" అంది.

"వెర్రిదానా! ఇంకా నువ్వు తప్పు చెయ్యలేదు. చెయ్యపోతున్నావు. చూడు ఆయన నీ కోసం ఎంత పరితపిస్తున్నారో! అర్థం చేసుకో. ఆఫీసు పని సరిగా చేసుకోరు. అన్నం సరిగా తినరు. తన మనస్సు ఎవరికీ విప్పి చెప్పరు. నేనే గ్రహించి అన్నాను. 'మనస్సును అనుమానాలతో నింపుకుని బాధపడి ప్రయోజనం లేదు. ధైర్యంగా అటో యిటో తేల్చుకోవాలి" అని. అన్యాపదేశంగా సలహా యిచ్చాను. ఆపైననే నీమనస్సు గ్రహిద్దామని ఈ వుత్తరం రాసేరు. ఆపైన నీ

యిష్టం. సుముఖత్వం చూపిరా మంచిదే. నే నేమీ అనుకోను. రహాభాగ సూత్రం జరగ కూడదు. అందరం మనుష్యులమే. గౌరవంతో అందరికీ వచుంది." అంది వసంత. వసుంధర చలించిపోయింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు నిలి చేయి. వసంత దేవతామూర్తిగా గోచరించింది. వెంటనే పోయి పత్రం తెచ్చి, చించి ముక్కలు వసంత చేతిలో పెట్టింది.

"నన్ను రక్షించావు వసంతా" అంది వసుంధర.

"కాదు. నన్ను నేను రక్షించుకున్నాను" అంది వసంత.

"సరే పోయివస్తాను" అంటూ తలుపు తెరిచింది. చలించిపోయింది. గుమ్మందగ్గర ఒక పురుషుడు స్మృతి తప్పి పడివున్నాడు. స్త్రీ మూర్తులిద్దరూ ఒకరిముఖం ఒకరుదీనంగా చూసుకున్నారు. ఒకేసారి పశ్చిమ దెసకేసి చూసేరు. తన్నుడాసిన సూర్యమిత్రుని నిర్దయతో వెనుకకు నెట్టిన పశ్చాత్తాపంలో పశ్చిమాద్రి కంది పోయింది.

* * *

సాయంత్రం స్మృతి తప్పిన మోహనరావు మధ్యాహ్నం మూడు గంటలకు కళ్లు తెరిచేడు. వసంత ప్రక్కన కూర్చుని విసురుతోంది. మోహనరావు దీనంగా చూసి "వసంతా! నేనింకా బ్రతికే వున్నానా?" అన్నాడు.

"అలాగనకండి. మీరు మా మాంగల్యం. నా సర్వస్వం. అలాగనకూడదు" అంది వసంత.

"ఔను వసంతా! నీవు పవిత్రమూర్తివి. నేను నీ మాంగల్యాన్ని. నీ సర్వస్వాన్ని. నేను నశించను" అన్నాడు.

ఇంతలో బయట పచారు చేస్తున్న వసుంధర లోనికి వచ్చి–

"మోహన్ బాబూ! అన్ని సంగతులూ మా వదినకే చెప్పాలా. నాకు కూడా చెప్పరాదా విశేషాలు" అంది.

మోహనరావు కొంచెం చలిస్తూ అన్నాడు.

"ఏముందమ్మా! నిన్నరాత్రి మోహనరావు అనే యువకుడు ఇక్కడ మరణించాడు"

"పాపం. అలాగా, ఈ మిగిలిం దెవరు?" అంది వసుంధర.

"ఈ మిగిలినది వసంత భర్తమాత్రమే." అన్నాడు మోహనరావు.

వసుంధర ఆవేదతో అంది:

"నిన్నరాత్రే ఆయన స్వప్నసుందరికూడా మరణించిందట."

"వసంత అందుకుంది.

"ఔనట, పాపం, పాపం! వాళ్ల ఆత్మలకి శాంతి కలుగుగాక! వాళ్ళ క్లిష్టతర చరిత్రకూడా ముక్కలు ముక్కలైపోయింది. ఇవిగో ఆ ముక్కలు" అంటూ పత్రం ముక్కలుపైకి తీసింది.

మోహనరావూ, వసుంధర 'ఆ ముక్కలు నాకు కావాలంటే నాకు కావాలంటూ' వసంత వైపు చేతులు చాపి, బరువు దింపుకున్న బాటసారులలాగ ఒకరి కళ్లల్లోకి కళ్లు సంతృప్తిగా చూసుకున్నారు.


ఈ క్రింది ఊళ్లలో ఇంగ్లీషు, తెలుగు 'స్వతంత్ర' పత్రికలు అమ్ముటకు,

ఏజెంట్లు కావలెను:

బళ్లారి, చోడవరం, చల్లపల్లి, ముద్దనూరు, నాగపూరు, నరసీపట్నం, పొన్నవల్లి అగ్రహారం, శృంగవరపుకోట, వెల్లూరు, ఎలమంచిలి, కైకలూరు.

వివరములకు :—

మేనేజరు, 'స్వతంత్ర'

160 లాయిడ్స్ రోడ్, రాయపేట, మదరాసు–14.